తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
09-04-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 71
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## ఫీజు కోసం విద్యార్థులను ఎండలో నిలబెడుతారా? తల్లిదండ్రులను అడగాలి

- పిల్లలను అడుగుతారా?
- డాన్ బాస్కో హై స్కూల్ దారుణం.

డాన్ బాస్కో హైస్కూల్లో చదువుతున్నారు సంవత్సర ఫీజులో ₹6,000 బకాయి ఉండడంతో బుధవారం నాడు స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ఫీజు చెల్లించాలని మందలించి మండుతున్న ఎండలో మోకాళ్లపై కూర్చుండ బెట్టారు




4

## కమ్ముకోనున్న చీకట్లు!

- విద్యుత్ ఆర్టీజన్ల సమ్మె ఎఫెక్ట్..
- రానున్న రోజుల్లో విద్యుత్ సంక్షోభం
- గ్రిడ్స్ కుప్పకూలే అవకాశం
- సర్కారు నిర్లక్ష్యం.. యాజమాన్యం నియంతృత్వం
- మొదటి రోజే సమ్మెలో పాల్గొన్న 90 శాతం కార్మికులు
- ఉవ్వెత్తున ఎగిసిన నిరసన జ్వాల



హైదరాబాద్, ఏప్రిల్ 8: తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖలోని ఆర్టీజన్లు చేపట్టిన నిరవధిక సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ఉధృత రూపం దాల్చింది. బుధవారం రెండు డిస్కామ్ ల పరిధిలో సుమారు 90 శాతం

మిగతా 2వ పేజీలో..



### ఫలించిన పాకిస్తాన్
# మధ్యవర్తిత్వం

- వెనక్కితగ్గిన అమెరికా, ఇజ్రాయిల్
- హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకల రాకపోకలకు ఇరాన్ అనుమతి
- రెండు వారాల పాటు ఇరుపక్షాలు దాడుల విరమణ

సైనిక చర్యల నిలుపుదల:ఒప్పందం ప్రకటించిన వెంటనే, ఇరాన్‌పై అమెరికా దాడులను నిలిపివేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ, తాము కూడా "రక్షణ చర్యలను" నిలిపివేస్తున్నామని, రెండు వారాల పాటు జలసంధిలో సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**అమెరికా**

అమెరికా మరియు ఇరాన్‌ల మధ్య మంగళవారం సాయంత్రం చివరి నిమిషంలో యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించకపోతే,

మిగతా 3వ పేజీలో..

**15 రోజుల విరామం** 8

### ఘన-తెలంగాణ మధ్య
## సంబంధాలు కొనసాగాలి

సీఎంను కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘన హైకమిషనర్




**సీఎంను కలిసిన 'టాటా లాక్‌హీడ్' ఎండీ టీమ్** 2



**పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి** 4

### కేరళ, అసోం, పుదుచ్చేరిలో
## పోలింగ్‌కు సిద్ధం

- నేడు మూడు రాష్ట్రాల్లో పోలింగ్
- శాసనసభ ఎన్నికలకు సిద్ధమైన కేరళ
- పుదుచ్చేరిలోనూ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు



3



## ఇరాన్ నుంచి సురక్షితంగా బయటపడండి

- భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 : ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము

మిగతా 2వ పేజీలో..



## ఆ భూముల్లో హైడ్రాకు అడుగుపెట్టే హక్కు లేదు

- హైకోర్టు న్యాయవాది ముఖీమ్

3

### ఎక్కడ ఎన్నికలు జరిగినా
## తెలంగాణయే ఏటీఎం

- దిల్లీకి గులాంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం
- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం

2



- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

## వచ్చే రెండు నెలలు కీలకం

- తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు
- 'ఉపాధి' పనుల బకాయిలను కేంద్రం విడుదల చేయాలి
- పెసా చట్టం అమలుకు త్వరలో శిక్షణ
- పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సమీక్ష

2





## 2బిహెచ్‌కె కాలనీల్లో దుకాణాల విక్రయాలు

- నేటినుంచి బహిరంగ వేలం ప్రక్రియ షురూ
- అందుబాటులో 1400కుపైగా షాపులు

2

## వనపర్తిలో హరీష్‌రావు సభకు అనుమతి రద్దు

- హైకోర్టుకు వెళతామన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



2



**స్థానిక పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధికే కేటాయించాలి...**

- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వినతి


5



# కమ్ముకోనున్న చీకట్లు!

**మొదటిపేజీ తరువాయి**

మంది కార్మికులు స్వచ్ఛందంగా విధులను బహిష్కరించి ఉద్యమంలో దూకారు. ప్రభుత్వం 'ఎస్మా' ప్రయోగించినా, యాజమాన్యం బెదిరింపులకు దిగినా వెనక్కి తగ్గని ఆర్టీజన్లు.. ఆయా డివిజన్, సర్కిల్ కార్యాలయాల ఎదుట నిరసనలతో హోరెత్తించారు. మొత్తం 9 కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి ఈ పోరాటాన్ని సాగిస్తుండగా, ఇతర ఇంజనీర్ల సంఘాలు కూడా వీరికి మద్దతు ప్రకటించడం విశేషం.



SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LTD.
( A Govt. of Telangana Undertaking)
(Formerly Central Power Distribution Company of Andhra Pradesh Ltd.)
Corporate Office, 6-1-50, Mint Compound :: Hyderabad-63
(Telangana State, India)
CIN U40109TG2000SGC034116, Website:WWW.tgsouthernpower.org

Memo.No.JS(IR&L)/GM(IR&L)/AS(IR&Reg)/PO(IR&Reg)/823-J/25, Dt: 07.04.2026.

Sub:- TGSPDCL – IR & Regulations – Indefinite Strike Notice of Telangana Vidyuth Artisan Employees Joint Action Committee (TVAEJAC) from dt.08.04.2026 – Instructions - Issued.

Ref:- 1. G.O.Rt.No.02 Energy (HR.A1) Dept, Dt.09.02.2026.
2. Notice dt.17.03.2026 received from Telangna Vidyuth Artisan Employees Joint Action Committee (TVAEJAC).
3. Endt.No.JS(IR&L)/GM(IR&L)/AS(IR&Reg)/PO(IR&Reg)/1602-J/2006, Dt.07.04.2026

-oo0oo-

In the reference 1st cited, the Govt. of Telangana in exercise of the Power conferred by the Sub-sections (1) & (3) of Section 3 of the Telangana Essential Services Maintenance Act 1971 (Act 20 of 1971) prohibiting strikes in all services under the TG Power Utilities for a period of 6 months w.e.f. with effect from 25.02.2026 to 24.08.2026.

2. In the reference 2nd cited, the Telangana Vidyuth Artisan Employees Joint Action Committee (TVAEJAC) has issued indefinite strike notice from **08.04.2026** for resolving their demands.

3. It is to inform that, on certain demands TVAEJAC has filed ID No.13 of 2025 before the Industrial Tribunal, the *lis* is pending for adjudication. As per the Section 23 (b) of ID Act' 1947, the TVAEJAC cannot issue a strike notice during the pendency of *lis* before a Labour Court, Tribunal or National Tribunal.

4. Therefore, all the Functional Heads of TGSPDCL are hereby instructed to inform the Employees & Artisans working under their control, not to participate in indefinite strike from dt.08.04.2026 @ 9:00 AM called by TVAEJAC, in view of Prohibition of Strikes in force and as per the Statutory prohibition, appropriate action may be initiated against the errant(s).

JITESH V. PATIL, I.A.S.,
CHAIRMAN & MANAGING DIRECTOR

To
All Chief Engineer of TGSPDCL/__________.
All Chief General Managers of TGSPDCL/__________.
The Joint Secretary/Corporate Office/TGSPDCL.
All Superintending Engineers of TGSPDCL/__________.

Copy to:
PS to Chairman & Managing Director/TGSPDCL/Hyderabad.
PS to Chairman & Managing Director, TGTRANSCO, HYDERABAD.
PS to Chairman & Managing Director, TGNPDCL, WARANGAL.
PA to Chief Vigilance Officer/TGSPDCL/Hyderabad – For Information
PS to All Directors/TGSPDCL/Hyderabad.
All General Managers /TGSPDCL.
All Divisional Engineers/TGSPDCL

**స్తంభించిన ఉత్పత్తి కేంద్రాలు**

సమ్మె ప్రభావం రాష్ట్రంలోని ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలపై స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తగూడెం థర్మల్ ప్లాంట్‌లో 2 వేల మంది, భూపాలపల్లి కాకతీయ థర్మల్ ప్లాంట్‌లో 400 మంది కార్మికులు విధులకు దూరమయ్యారు. శ్రీశైలం, జురాల వంటి జలవిద్యుత్ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేవలం ఉత్పత్తి కేంద్రాలే కాకుండా, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించే సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, మరమ్మతులు చేసే ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్‌వోసీ) సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు సైతం సమ్మెలో చేరడంతో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

**'ఎస్మా'పై మండిపాటు**

కార్మికులను చర్చలకు పిలవాల్సింది పోయి, అరెస్టులు, ఎస్మా ఉత్తర్వులతో భయపెట్టాలని చూడటంపై జేఏసీ నేతలు నిప్పులు చెరిగారు. దక్షిణ డిస్కం సీఎండీ జితేష్ వి పాటిల్ జారీ చేసిన సమ్మె నిషేధ ఉత్తర్వులను వారు తీవ్రంగా ఖండించారు. పోలీసుల అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు కొందరు కీలక నేతలు అజ్ఞాతంలోకి వెళ్లి వ్యూహాత్మకంగా ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. 'ఆర్టీజన్ వద్దు కన్వర్షన్ ముద్దు' అనే నినాదంతో యాజమాన్య మొండి వైఖరి నశించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

**పొంచి ఉన్న విద్యుత్ సంక్షోభం**

విద్యుత్తు సంస్థల్లో క్షేత్రస్థాయి ఉద్యోగులంటే ఆర్టిజన్లే. విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాలో వీరే అత్యంత కీలకం. కొత్తగూడెం థర్మల్‌ప్లాంట్‌లోని అన్ని యూనిట్లల్లో ఆర్టిజన్లు విధులను బహిష్కరించడంతో ప్రభావం స్పష్టంగా కనిపించింది. భూపాలపల్లి థర్మల్‌ప్లాంట్‌లోని కార్మికులు సైతం విధులను బహిష్కరించగా.. పోగయ్యే బూడిదను తొలగించడం సమస్యగా మారింది. ఇంకో రెండు రోజులు గడిస్తే థర్మల్‌ప్లాంట్లు నడిచే పరిస్థితి ఉండదన్న వాదనలున్నాయి. మ్యాన్‌పవర్ తగ్గడం, కార్మికుల కొరత సమస్యలతో అధికారులకు తలప్పులు తప్పడంలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నా సరిపడా కార్మికులు దొరకడంలేదు. అయితే ఎండలు మండిపోతుండటంతో విద్యుత్తు వినియోగం పెరుగుతున్నది. అటు సమ్మె.. ఇటు ఏదో సమస్య తలెత్తితే ఇబ్బందులు తప్పవన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనరేటింగ్ స్టేషన్లు మొదలుకుని, సబ్‌స్టేషన్ల వరకు కార్మికులంతా సమ్మెకు వెళ్లడంతో విద్యుత్తు వ్యవస్థ అస్థవ్యస్థంగా మారుతుందని, గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందన్న అభిప్రాయాలొస్తున్నాయి.



# ఇరాన్ నుంచి సురక్షితంగా బయటపడండి

**మొదటిపేజీ తరువాయి**

సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని, ఎంబసీని సంప్రదించకుండా, అనుమతి తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్ అమెరికా రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. మంగళవారం రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది.

**మార్కెట్లకు జోష్ : భారీ లాభాల్లో ప్రారంభమైన దేశీయ సూచీలు**

ఇరాన్‌పై రెండు వారాలపాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మదర్సన్, ఎల్ అండ్ టీ నాన్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఆయిల్ ఇండియా, నాల్కో, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, సన్ ఫార్మ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1843 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2473 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.55గా ఉంది.

# వచ్చే రెండు నెలలు కీలకం

- తాగునీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు
- 'ఉపాధి' పనుల బకాయిలను కేంద్రం విడుదల చేయాలి
- పెసా చట్టం అమలుకు త్వరలో శిక్షణ
- పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

వేసవి నేపథ్యంలో వచ్చే రెండుమూడు నెలలు అత్యంత కీలకమని, ఈ సమయంలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. ప్రజలు నీటిని వృధా చేయకుండా అవసరానికి తగ్గట్టుగా వినియోగించేలా అవగాహన పెంచాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, ఏజెన్సీల్లో పెసా చట్టం అమలు అంశాలపై బుధవారం ఆమె సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి బేసిన్ల నుంచి నీటి కేటాయింపులు కొనసాగుతున్నందున ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు లేవని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సింగూర్, శ్రీశైలం వంటి జలాశయాల్లో తాగునీటి నిల్వలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీటి సరఫరా పరిస్థితిపై రోజూ నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడైనా సోర్స్ పాయింట్లలో కొరత తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలు, సరఫరా లోపాలను త్వరితగతిన సరిదిద్దాలని సూచించారు. 1916 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని, ప్రజల్లో ఈ సేవపై మరింత అవగాహన కల్పించాలని అన్నారు. నీటి మౌలిక వసతులపై సమగ్ర డేటాను సేకరించి, భవిష్యత్ ప్రణాళికలకు ఉపయోగపడే విధంగా రికార్డులు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. చేతి పంపులు, మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టడం, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పథకంపై మంత్రి సమీక్షిస్తూ అటవీ, దూర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు కష్టంగా మారిందన్నారు. ఈ నిబంధనలను సడలించాల్సిందిగా కేంద్రానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఉపాధి కల్పనలో దేశంలో రెండో స్థానంలో ఉండటం గర్వకారణమని, రోజుకు మూడు లక్షల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. పని దినాలను పెంచేందుకు రోజువారీ సమీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**పెసా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా చట్టం అమలుపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. పెసా పరిధిలో ఉన్న 1,289 గ్రామ పంచాయతీలలో చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఆదివాసీ, గిరిజనుల హక్కులను రక్షించడంలో ఈ చట్టం కీలకమని, ఇసుక, అటవీ వనరుల వినియోగంపై నిర్ణయాధికారం గ్రామ సభలకే ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన పెంచాలని, జిల్లా కోఆర్డినేటర్లు, గ్రామ సభ మొబిలైజర్ల నియామకాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల అమలులో సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రతి 15 రోజులకొకసారి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ దివ్య దేవరాజన్, ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఏటీఎం

- ఢిల్లీకి గులాంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం
- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం
- కొత్త పార్టీతో సామాన్యులకు అండగా నిలుస్తాం
- ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు బుధవారం చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతుందని ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోటా జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు.



జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని, కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి మోదీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.



## ఘన-తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని రిపబ్లిక్ ఆఫ్ ఘన హైకమిషనర్ క్వాసి ఒబిరిడాన్సో బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన ఆయన ఘన తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్యం, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని హైకమిషనర్ డాన్సో కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

## సీఎంను కలిసిన 'టాటా లాక్‌హీడ్' ఎండీ టిమ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ఎండీ టిమ్ రైఫిల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారత దేశంలో సీ 130 జే సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఏర్పాటు చేయనున్నది. అంతర్జాతీయ అవసరాల కోసం భారత దేశంలోని టీఏఎస్ఎల్‌లో ఎఫ్16 వింగ్స్‌ను ఉత్పత్తి చేసేందుకు టీఏఎస్ఎల్‌తో లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు టిమ్ రైఫిల్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# వనపర్తిలో హరీష్‌రావు సభకు అనుమతి రద్దు

- హైకోర్టుకు వెళతామన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

కాంగ్రెస్ సర్కార్ ప్రజాపాలనలో అప్రజాస్వామిక విధానాలు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. పరిగి రైతుల పరామర్శకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టు చేసిన సర్కార్ వనపర్తిలో హరీష్ రావు బహిరంగ సభకు అనుమతులను రద్దు చేసింది. వనపర్తి నియోజకవర్గం రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత వంద రోజులుగా రైతులు దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా ఈ నెల 9న హరీశ్‌రావు బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సమావేశానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు సభ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ అకస్మాత్తుగా గతంలో ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టుకు వెళ్లి సభకు అనుమతులు తెచ్చుకుంటామని తెలిపారు. ప్రజలు, రైతాంగం తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు కొత్త కాదని తెలిపారు. తాము కేసులు, బెదిరింపులకు భయపడితే ఈ తెలంగాణ వచ్చేది కాదని స్పష్టం చేశారు.



# 2బిహెచ్‌కె కాలనీల్లో దుకాణాల విక్రయాలు

- నేటినుంచి బహిరంగ వేలం ప్రక్రియ షురూ
- అందుబాటులో 1400కుపైగా షాపులు

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

హైదరాబాద్ పరిసరాల్లోని 'క్యూర' పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని 1400కు పైగా దుకాణాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 36 కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం ద్వారా విక్రయించడానికి ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. తొలుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది కాలనీల్లోని 273 షాపులకు ఈ నెల 9, 10 తేదీల్లో వేలం ప్రక్రియ నిర్వహించనున్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీల్లో స్థానికుల అవసరాలకనుగుణంగా వ్యాపారాలు నిర్వహించుకునేలా 60400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు దుకాణాలను నిర్మించారు. వీటిని ఉన్నవి ఉన్నట్లుగా అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. వీటికి కనీస ధరలను కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగానే నిర్ధారించామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కాలనీలను సందర్శించి తమకు నచ్చిన, అనువైన దుకాణాలను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం ధరావతుతో వేలం నిర్వహించే తేదీల్లో ఉదయం 11 గంటల లోగా సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని వివరించారు. దుకాణాల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఈ కాలనీల నిర్వహణకు వినియోగించనున్నారు. ఇందుకు సహకార సంఘాల చట్టం కింద కాలనీ నివాసితుల సంక్షేమ సంఘాలను (వేల్ఫేర్ అసోసియేషన్లను) ఏర్పాటు చేస్తారు. వాటి ఆధ్వర్యంలో ఈ కాలనీల నిర్వహణఅభివృద్ధికి జాయింట్ అకౌంట్ ద్వారా ఈ నిధులను వినియోగించనున్నారు. ఇందుకోసం షాపుల ద్వారా వచ్చిన మొత్తాన్ని కార్పస్ ఫండ్‌గా డిపాజిట్ చేస్తారు. దానిపై వచ్చే ఆదాయంతోపాటు, ఫ్లాట్లలో నివసించే వారి నుంచి నిర్వహణ రూపేణా ప్రతి నెలా వసూలు చేసే మొత్తంతో ఆయా కాలనీల నిర్వహణను చేపడతారు. ప్రధానంగా కామన్ ఏరియాల్లోని లైట్లు, లిఫ్టులు, బోరింగ్ మొదలైన వాటి నిర్వహణ ఖర్చులతోపాటు, అత్యవసరమైన చిన్నచిన్న మరమ్మతులు మొదలైన వాటి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ఈ నిధులను వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. అంతేకాక కాలనీల్లోని దుకాణాల ద్వారా పలువురికి ఉపాధి లభించడంతోపాటు స్థానికులకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులోకి వస్తాయన్నది ప్రభుత్వ ఉద్దేశం.



**వేలం నిర్వహించే తేదీలు**

ఈనెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని 8 కాలనీల్లో 273 దుకాణాల వేలం ప్రక్రియ నిర్వహిస్తారు. 15, 16 తేదీల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని 10 కాలనీల్లోని 77 దుకాణాలకు, 15, 17 తేదీల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 12 కాలనీల్లోని 892 షాపులకు, సంగారెడ్డి జిల్లా పరిధిలోని 6 కాలనీల్లోని 372 షాపులకు 15 నుంచి 18వ తేదీ వరకు, 21వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నారు. అదనపు సమాచారం కోసం ఆయా జిల్లాల హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌లను సంప్రదించవచ్చని ఎండీ గౌతం సూచించారు.



# ఫలించిన పాకిస్తాన్ మధ్యవర్తిత్వం

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ "మొత్తం నాగరికతను" తుడిచిపెట్టే స్తానని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన కొద్ది గంటలకే ఈ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ ఒప్పందాన్ని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇరాన్ తన డిమాండ్లకు లొంగిపోవాలని ట్రంప్ విధించిన రాత్రి 8 గంటల (ఈస్టర్న్ టైమ్) గడువు కంటే ముందే, వెనక్కి తగ్గాలని పాకిస్థాన్ ఆయనను కోరింది. రెండు వారాల పాటు ఇరుపక్షాలు కాల్పుల విరమణ పాటించాలని, ఈ సమయంలో చమురు, గ్యాస్ మరియు ఇతర నౌకలను సురక్షితంగా వెళ్లనివ్వాలని పాకిస్థాన్ ప్రతిపాదించింది.

**ప్రధాన పరిణామాలు:**

సైనిక చర్యల నిలుపుదల:ఒప్పందం ప్రకటించిన వెంటనే, ఇరాన్‌పై అమెరికా దాడులను నిలిపివేసినట్లు ఒక అధికారి తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ, తాము కూడా "రక్షణ చర్యలను" నిలిపివేస్తున్నామని, రెండు వారాల పాటు జలసంధిలో సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ మద్దతు: ఇజ్రాయెల్ కూడా ఈ యుద్ధ విరమణకు అంగీకరించిందని, రెండు వారాల పాటు దాడులను నిలిపివేస్తుందని వైట్ హౌస్ వెల్లడించింది.

**దౌత్య విజయం: చైనా జోక్యం మరియు పాకిస్థాన్ దౌత్య ప్రయత్నాల వల్ల ఇరాన్ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. ఇరాన్ జాతీయ భద్రతా మండలి దీనిని తమ విజయంగా అభివర్ణించింది.

**నేపథ్యం:**

ఈ యుద్ధం ఫిబ్రవరి చివరలో అమెరికా మరియు ఇజ్రాయెల్ ఇరాన్‌పై భారీ సైనిక దాడులు చేయడంతో ప్రారంభమైంది. ఒకానొక దశలో, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు మరియు వంతెనలపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించడంతో చర్చలు నిలిచిపోయాయి. "ఈ రాత్రి ఒక మొత్తం నాగరికత అంతమైపోతుంది, అది మళ్ళీ ఎప్పటికీ తిరిగి రాదు," అని ట్రంప్ అంతకుముందు హెచ్చరించారు. అయితే ఏదో ఒక "అద్భుతం" జరుగుతుందని ఆశిస్తున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు.

మంగళవారం రాత్రి పాకిస్థాన్ ప్రధాన మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, ఈ కొత్త ఒప్పందం ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మిత్రపక్షమైన హిజ్బుల్లా మధ్య లెబనాన్‌లో జరుగుతున్న పోరాటానికి కూడా వర్తిస్తుంది.

# సీఎస్ఆర్ నిధులను ఖర్చుగా భావించొద్దు

- **అది భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి**
- **విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి**
- **విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుదాం**
- **కార్పొరేట్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ కంపెనీలు సీఎస్ఆర్ కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచు కొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని సూ చించారు. ప్రభుత్వంతోపాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్ర పంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటివరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపా రు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వై ద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వార సత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియో గించవ చ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయిం చేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతిని ధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్య, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు. రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, నాదమ్ ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పాల్గొన్నారు.



# కేరళ, అసోం, పుదుచ్చేరిలో పోలింగ్‌కు సిద్ధం

- **నేడు మూడు రాష్ట్రాల్లో పోలింగ్**
- **శాసనసభ ఎన్నికలకు సిద్ధమైన కేరళ -**
- **140 స్థానాల్లో బరిలో నిలిచిన 883 అభ్యర్థులు**
- **పుదుచ్చేరిలోనూ ఎన్నికలకు ఈసీ ఏర్పాట్లు**



**న్యూఢిల్లీ:**

కేరళ, పుదుచ్చేరి, అసోం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 76 వేల మంది పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలను మోహరించినట్లు పేర్కొంది. వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

అసోం అసెంబ్లీలోని 126 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. మొత్తం 35 జిల్లాల్లో 31,490 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. 126 నియోజకవర్గాల్లో 722 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 59 మంది మహిళలు ఉన్నారు. కాంగ్రెస్ 99 స్థానాల్లో, బీజేపీ 90 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాయి. ఈ ఎన్నికల్లో సుమారు 2.5 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో 1.25 కోట్ల మంది మహిళలు ఉండగా, 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. గతంలో పలు విడతలుగా జరిగిన ఎన్నికలకు భిన్నంగా ఈసారి అసోంలో ఒకే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు.

కేరళలో 140 అసెంబ్లీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో 883 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 2.71 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. అందులో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. విదేశీ ఓటర్లు సుమారు 2.42 లక్షల మంది ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కేరళలో మొత్తం 30,495 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సుమారు 1.46 లక్షల మంది అధికారులు విధుల్లో ఉన్నారు. ప్రధానంగా LDF, UDF, NDA కూటముల మధ్య పోటీ నెలకొంది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 30 స్థానాలకు గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. ఎన్నికల కోసం 1,099 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం ప్రాంతాల్లో కలిపి 30 స్థానాలకు 294 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక్కడ ప్రధానంగా NDA, ఇండియా కూటముల మధ్య పోటీ నెలకొంది. మొత్తం 9,48,977 మంది ఓటర్లు ఉండగా, అందులో 4,45,761 మంది పురుషులు, 5,03,076 మంది మహిళలు, 140 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో ఏప్రిల్ 23న ఓటింగ్ జరగనుండగా, పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడత ఏప్రిల్ 23న, రెండో విడత ఏప్రిల్ 29న జరగనుంది. అన్ని రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను మే 4న వెల్లడించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది.

# అమెజాన్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

- **ఖండించిన అమెజాన్ సంస్థ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:**




ముచ్చటగా మూడోసారి భారీగా ఉద్యోగాల కోతకు ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదంటూ ఆన్ ఫోరమ్స్, టెక్ పోర్టల్స్ వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో భారీగా ఉద్యోగులను కొలువుల నుంచి ఈ సంస్థ తొలగించింది. తాజాగా ఈ ఏడాది మే లో మళ్లీ భారీగా ఉద్యోగులను తొలగిస్తుందంటూ ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆ సంస్థ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రచారాన్ని అమెజాన్ ఖండించింది. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని ప్రకటించింది. చైనాకు చెందిన టెక్ పోర్టల్ లీ ఫెంగ్ నెట్‌వర్క్ సైతం ఈ వార్తను ప్రచురించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్, మానవ వనరుల విభాగంలోని ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండవచ్చని చైనా టెక్ పోర్టల్ వివరించింది. అలాగే ఎల్5 నుంచి ఎల్7 ఉద్యోగ స్థాయిల్లోని మేనేజర్లు, వైట్ కాలర్ ఉద్యోగులపై కూడా ఈ ప్రభావం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ గిడ్డంగి, లాజిస్టిక్స్ సిబ్బందిపై ఈ ప్రభావం ఉండదని నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కార్పొరేట్ కంపెనీ ఇప్పటికే 2025 అక్టోబర్‌లో 14 వేల మంది, 2026 జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఈ సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం కోసం సీఈవో ఆండీ జస్సీ నేతృత్వంతో ఈ ఉద్యోగుల తొలగింపు పక్రియను చేపట్టింది. మరోవైపు ఏఐ, మౌలిక సదుపాయాలలో అమెజాన్ సంస్థ భారీగా పెట్టుబడులు పెడుతుంది. ఈ పెట్టుబడులను పెంచుకొంటూ పోతున్నది. ఏఐ వినియోగం పెరిగే కొద్దీ ఉద్యోగుల పాత్ర మునుపటి స్థాయిలో ఉండకపోవచ్చుననే అభిప్రాయాన్ని అమెజాన్ సంస్థ తాజాగా వ్యక్తం చేస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు 57 వేల మందికిపైగా ఉద్యోగులను అమెజాన్ తొలగించిన విషయం విదితమే.

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై అత్యాచారం

- **ఇన్‌స్ట్రక్టర్ అఘాయిత్యం**
- **ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, ఏప్రిల్8:**

బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవిక్సన్స్ పైలట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ఇన్‌స్ట్రక్టర్ గా పనిచేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నసీముద్దీన్‌కు దమ్మాయిగూడకు చెందిన మరొక ఇన్‌స్ట్రక్టర్ సల్మాన్ సహకరించాడు. యువతిపై అత్యాచారం జరిపి వీడియోలు, ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయమాటలతో లొంగదీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్. పలుమార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025లో అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉండడంతో బేగంపేట పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. 2025 జనవరి నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది.

# 'నారీశక్తి వందన్' చరిత్రాత్మక నిర్ణయం

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**
- **శిల్పా పార్క్ అపార్టుమెంట్స్ వాసులతో ఆత్మీయ సమ్మేళనం**

**హైదరాబాద్, ఏప్రిల్ 8:**

మహిళా సాధికారత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన నారీశక్తి వందన్ అధినియం ఒక చరిత్రాత్మక నిర్ణయమని, దీని ద్వారా చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. 2029 ఎన్నికల నుంచి రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని చెప్పారు. కొండాపూర్‌లోని శిల్పా పార్క్ అపార్టుమెంట్ నివాసితులతో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరగనుందని, ప్రస్తుతం జరుగుతున్న ఓటరు లిస్టు శుద్ధి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అనేది కేంద్రం నిర్ణయం కాదని, భారత ఎన్నికల సంఘం అమలు చేస్తున్న విధానమని, 2002 నుంచి ఇప్పటివరకు పెద్దస్థాయిలో ఈ ప్రక్రియ జరగలేదని, ఈ కాలంలో చాలామంది ఓటర్లు వేరే చోటకు మారడం, మరణించడం వంటి కారణాలతో లిస్టులో లోపాలు ఏర్పడ్డాయని అన్నారు. వీటిని సరిచేయడానికి ఎన్నికల సంఘం ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు చేస్తున్నదని చెప్పారు. అందువల్ల ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకోవడం చాలా అవసరమని అన్నారు. లిస్టుల్లో తప్పుల వల్ల ఓటింగ్ శాతం పడిపోతోందన్నారు. మరోవైపు హైదరాబాద్ పాత బస్తీ ప్రాంతాల్లో ఒకే ఇంట్లో వందల సంఖ్యలో ఓట్లు నమోదై ఉండటం వంటి అనుమానాస్పద అంశాలు, కొన్ని ప్రాంతాల్లో రోహింగ్యాలు అక్రమంగా ప్రవేశించి స్థానికంగా ఎంఐఎం మద్దతుతో ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు పొందినట్లు చూస్తూనే ఉన్నామని, అందుకే డిటెక్టుడిలీట్‌డిపోర్టు అనే లక్ష్యంతో 'సర్' ప్రక్రియ చాలా అవసరమని ఆయన అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఈ ప్రక్రియలో పాల్గొన్నారని, తెలంగాణలో కూడా ఇది వేగవంతం కావాలని చెప్పారు. ఒకచోట 500 నుండి 800 ఓట్లు ఉంటే ఆ ప్రాంతంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేసే అవకాశముంటుందన్నారు. కాగా, ఇరాన్‌పై ఇజ్రాయెల్‌అమెరికా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ ధరలు 17% నుండి 50% వరకు పెరిగినప్పటికీ దేశంలో ధరలను పెంచకుండా, కొరత లేకుండా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు.



# ఆ భూముల్లో హైడ్రాకు అడుగుపెట్టే హక్కు లేదు

- **హైకోర్టు న్యాయవాది ముఖీమ్**

**పటాన్ చెరు, ఏప్రిల్ 8:**



బలహీనవర్గాల భూములపై కన్నేసిన రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో దోపిడీకి పాల్పడుతున్నదని హైకోర్టు న్యాయవాది ముఖిమ్ అన్నారు. హైడ్రాపై ధ్వజమెత్తిన న్యాయవాది ముఖీమ్ మాకు అనుకూలమైన డిక్రీ ఉందని, రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు ఐలాపూర్ భూములలో ప్రవేశించే హక్కు లేదని అన్నారు. ఐలాపూర్ భూముల్లో హైడ్రా అధికారులు వాహనాలలో నిత్యం తిరుగుతూ గ్రామస్తులను, ఆ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న ఐలపూర్ భూములపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టిన అమీన్ పూర్ రెవెన్యూ అధికారుల చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సంవత్సరం క్రితం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ పేరుతో నూతనంగా ఏర్పడిన సొసైటీ హైడ్రా అధికారి రంగనాథ్ తో కలిసి ఐలాపూర్ భూములలో భారీ భూ కుంభకోణానికి తెరలేపినట్లు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని, త్వరలోనే ఆ గుట్టు రట్టు చేస్తామని ముఖీమ్ అన్నారు. ఐలాపూర్ భూముల వ్యవహారంలో రిట్ అప్పీల్ పెండింగ్ ఉందని రిట్ అప్పీల్ ద్వారా హైడ్రా అధికారులు ఐలపూర్ భూముల్లోకి ప్రవేశించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారి రంగనాథ్ జోక్యం తగదని హైడ్రా తన నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు. గ్రామస్తులను ఉద్దే శించి మాట్లాడుతూ.. ఎవరూ హైడ్రాకు భయ పడవద్దని న్యాయస్థానాలు మనకు రక్షణ కవ చంలా ఉన్నాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఐలాపూర్ భూముల రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఐలాపూర్ భూముల వ్యవహారంలో హైడ్రా, రెవెన్యూ అధికారులు నిబంధనలకు అనుగుణంగా సంయమనంతో పనిచేసే విధంగా ఆయా శాఖ లను కట్టడి చేయాలని గ్రామస్తులను భయ భ్రాం తులకు గురి చేయకుండా కేసులు తుది తీర్పు వచ్చేంతవరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా వ్యవహరించే విధంగా ఆదేశాలు ఇవ్వాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. కోర్టు పరిధిలో లేని వివాదాస్పదం కాని భూముల వ్యవహారంలోకి హైడ్రా, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకోవద్దని ఎమ్మార్పీఎస్ తరపున విజ్ఞప్తి, సూచన చేశారు. రైతులకు ఉండే చట్టబద్ధమైన హక్కులను హైడ్రా కాలరాయొద్దని, ఆ భూములలో వ్యవసాయం, నిర్మాణాలు చేసుకునే హక్కులు వారికి ఉంటాయని ప్రభుత్వానికి హితవు పలికారు. హైడ్రా పరిధిని ప్రశ్నిస్తూ నిబంధనలకనుగుణంగా ఈ సంస్థ పని చేస్తున్నదా లేదా అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయాలని కోరారు. హైడ్రా తన పరిధి మించి వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో దానిని అరికట్టే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలో ఉన్నదని అన్నారు. హైడ్రా తన పరిధిని విస్మరించి వ్యవహరించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి ఉన్నదని వినిపిస్తున్న ఆరోపణలకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకతను నిరూపించుకునే అవసరం ఎంతైనా ఉన్నదని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలాపూర్ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన అక్రమ ఇసుకకు వేలంపాట

- 106,500 దక్కించుకున్న సర్పంచ్ సునీల్.
- వేలం పాట బదులుగా ఇందిరమ్మ ఇండ్లకు కేటాయిస్తే బాగుండేది.. లబ్ధిదారుల మొర..

రామాయంపేట, ఏప్రిల్ 8(సిరి న్యూస్)



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా ఇండ్లకు ఇసుక లేకపోవడం వల్ల ఇల్లు కట్టుకోలేక పోతున్నామంటూ, సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇండ్లకు కేటాయిస్తే బాగుండేదని లబ్ధిదారులు మొర పెట్టుకున్నారు. వారి విన్నపాన్ని తాసిల్దార్ తిరస్కరించి బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వేలంపాటలో సుతార్ పల్లి గ్రామ సర్పంచ్ సునీల్ పాల్గొని సుమారు 18 ట్రాక్టర్ల ఇసుకను రూ.1,06,500కు దక్కించుకున్నారు. అయితే అధికారుల సమాచారం మేరకు ఇటీవలి కాలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించిన రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా గుర్తించిన అక్రమ ఇసుకను సీజ్ చేసి, తాసిల్దార్ కార్యాలయంలో డంపు చేశారు. అట్టి ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలానికి పెట్టారు. ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు స్థానిక తహసిల్దార్ రజనీకుమారి తెలిపారు.వేలంపాటకు స్థానికులు, వ్యాపారులు హాజరై పోటీగా పాల్గొన్నారు. చివరికి సర్పంచ్ సునీల్ అత్యధిక ధరకు పాట పాడగా ఆయనకు ఇసుకను కేటాయించారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు తాసిల్దార్ తెలిపారు.అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. స్థానికంగా ఇలాంటి చర్యలు అక్రమ రవాణాను అరికట్టడంలో సహాయపడ తాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# పక్కగా ఇండ్ల గణన బ్లాక్ తయారు చేయాలి





- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ ఏప్రిల్, 08(సిరిన్యూస్)

క్షేత్ర స్థాయిలో పక్కగా ఇండ్ల గణన బ్లాక్ లను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జనగణన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. క్షేత్రస్థాయిలో 9 మంది అధికారులు టీం గా ఏర్పడి క్లస్టర్ లో జరుగుతున్న గణనలో పలు సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. జనాభా, గ్రామ ,మండల, పట్టణ ,సరిహద్దులపై అవగాహనా కలిగి ఉండాలన్నారు. టీం సభ్యులు, జనాభా గణాంక అధికారులు సమన్వయంతో ఇండ్ల గణన బ్లాక్ లిస్టు పక్కగా తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈడియం సందీప్, తాహాసిల్దారులు, గణాంక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు కోసం విద్యార్థులను ఎండలో నిలబెడుతారా?

- తల్లిదండ్రులను అడగాలి
- పిల్లలను అడుగుతారా?
- డాన్ బాస్కో హై స్కూల్ దారుణం.

నర్సాపూర్ మార్చి 08 (సిరి న్యూస్)



ట్యూషన్ ఫీజు చెల్లించలేదని చిన్నారుల పట్ల అమానుషంగా ప్రవర్తించింది నర్సాపూర్ డాన్ బాస్కో హై స్కూల్ యాజమాన్యం వివరాల్లోకి వెళితే నర్సాపూర్ పట్టణానికి చెందిన విజయ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను డాన్ బాస్కో హైస్కూల్లో చదువుతున్నారు సంవత్సర ఫీజులో ₹6,000 బకాయి ఉండడంతో బుధవారం నాడు స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ఫీజు చెల్లించాలని మందలించి మండుతున్న ఎండలో మోకాళ్లపై కూర్చుండ బెట్టారు అనే విషయం తెలుసుకున్న తల్లి స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తన పిల్లలను వేధించడమే కాకుండా,ఎండలో కూర్చుండబెట్టి మానసిక ఆందోళనకు గురి చేశారని ఆమె ఆరోపించారు.విద్యాసం స్థలలో విద్యా బుద్ధులు నేర్పాల్సిన చోట ఇలాంటి చర్యలు చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు డాన్ బాస్కో హై స్కూల్లో చాలా జరిగాయని ఎంతో ప్రేమగా చూసుకునె పిల్లలను ఇంత దారుణంగా ఎండలో ఉంచడం మంచిది కాదని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను కూడా వేధిస్తుంటారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇదే విషయం పై ప్రిన్సిపాల్ కు ఫోన్ లో వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి సంఘటనను పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు






# పార్క్ వెంటనే తెరిపించాలి

తొంట అంజయ్య

రామచంద్రపురం, ఏప్రిల్ 8 (సిరి న్యూస్):



రామచంద్రపురం 268వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో మూసివేసిన పార్కును వెంటనే తెరిపించాలని మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య కురుమ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.గత నాలుగు నుంచి ఐదు నెలలుగా పార్కు మూసివేయడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే డివిజన్లో శానిటేషన్ సమస్యలు పెరిగి పలుచోట్ల చెత్త పేరుకుపోయిందని పేర్కొన్నారు.సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు.

# ట్రాఫిక్ కు అడ్డుగా ఉన్న అక్రమాల తొలగింపు

రోడ్ల విస్తరణకు మార్గం సుగమం





జిన్నారం ఏప్రిల్ 08 సిరి న్యూస్

అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ బొల్లారం గ్రామంలో రహదారుల విస్తరణకు మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా భారీ ఎత్తున అక్రమణలు తొలగింపు, అమీన్పూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ బృందం స్థానిక పోలీస్ మరియు ట్రాఫిక్ పోలీస్ విభాగల సమన్వయంతో ఈ డ్రైవ్ నిర్వహించారు అని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ...ట్రాఫిక్ కు అడ్డుగా ఉన్న అక్రమణాలను క్లియర్ చేయడం జరిగిందని తెలిపారు. రోడ్లపైకి చొచ్చుకు వచ్చిన తాత్కాలిక రేకుల షెడ్లు మరియు మెట్లు దుకాణాల బోర్డులు ప్లెక్సీలు తాత్కాలిక నిర్మాణాలను పూర్తిగా తొలగించి రోడ్డును క్లియర్ చేశామని తెలిపారు. ఈ డ్రైవ్ లో మొత్తం 86 అక్రమణాలను తొల గించామని తెలిపారు.

# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- రోడ్లు, కోర్టు భవన నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ఏప్రిల్,08(సిరిన్యూస్)



ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన రోడ్లు కోర్టు బిల్డింగ్స్ త్వరగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు నెలకొన్న పక్షంలో పరిష్కరించుకొని తద్వారా ముందుకు పోవాలన్నారు, అనంతరం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి.ఈ.ఈ వేణు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈ.ఈ నరసింహులు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడు ఏసీబీ కి చిక్కాడు

**మహబూబాబాద్,ఏప్రిల్ 8(సిరి న్యూస్ )**

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్య నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గూడూరు ఇన్చార్జ్ ఎంఈవో రవికుమార్ బుధవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఓ పని నిమిత్తం బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయన్ను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు మండలపరిధిలోని రవీందర్ అనే రెటైర్డ ఉద్యోగి బెనిఫిట్స్ చెల్లించడానికి 45 వేల రూపాయలు ఎంఈఓ రవికుమార్ డిమాండ్ చేయగా,సదరు ఉపాధ్యాయుడు ఏసీబీ ని ఆశ్రయించాడు.మహబూబాబాద్ ఏసీబీ డిఎస్పి ఆనంద్ నేతృత్వంలో బృందం లంచం తీసుకుంటుండగా రవికుమార్ ను రెడ్హ్యాండెడ్ గా పట్టుకుంది.రవికుమార్ తో పాటు మరో ఉద్యోగిని చంద్రమౌళి ని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపుతున్నట్టు ఏసీబీ డిఎస్పి ఆనంద్ తెలిపారు.

# ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి

## ! ఏపీవో వీరప్ప



**(సిరి న్యూస్ )కొండాపూర్, ఏప్రిల్ 8:**

ఉపాధి పనిలో జాగ్రత్తలు పాటించాలని ఏపీవో వీరప్ప కూలీలకు సూచించారు. బుధవారం గొల్లపల్లి ఉపాధి పనులను పరిశీలించారు. రైతులకు ఉపాధి హామీలో అనేక వ్యవసాయ అభివృద్ధి పాడి పరిశ్రమల పనులకు అవకాశం ఉందన్నారు.కూలీలు చేసే ప్రదేశం జియో ట్యాగ్ ఆన్లైన్ నమోదు, కొలతల ఆధారంగా చెల్లింపులు ఉంటాయన్నారు. అవసరమైనన్ని త్రాగునీటిని అందుబాటులో ఉంచి, పనులు జరుగుతున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై కూలీలకు వివరించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయాన్నే పనులను హాజరై ఉష్ణోగ్రతలు పెరుగకముందే ఇంటికి చేరేలా, కూలీలను పెంచేందుకు ప్రణాళికలు ఉంచాలని, సీనియర్ మేట్ మాణిక్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# స్థానిక పరిశ్రమల సీఎస్ ఆర్ నిధులు స్థానిక అభివృద్ధికే కేటాయించాలి

## జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వినతి

## నిధులు కేటాయించకపోతే ప్రజా ఉద్యమం హెచ్చరిక



**రామచంద్రపురం, ఏప్రిల్ 8 (సిరి న్యూస్):**

పటాన్చెరు నియోజకవర్గంలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.పటాన్చెరు నియోజకవర్గంలో బల్క్ డ్రగ్స్, కెమికల్ పరిశ్రమలు అధికంగా ఉండటంతో కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ నిధులను స్థానికంగా అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉండగా, ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు.గత రెండున్నర సంవత్సరాలుగా సీఎస్ఆర్ నిధులు అందకపోవడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు అత్యవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సీఎస్ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమం చేపడతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

# అస్సాం ముఖ్యమంత్రి ఖర్గేకు క్షమాపణలు చెప్పాలి



**రామచంద్రపురం, ఏప్రిల్ 8 (సిరి న్యూస్):**

ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలను సంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కొల్కురి నరసింహారెడ్డి తీవ్రంగా ఖండించారు.బుధవారం పటాన్చెరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో నిరుద్యోగం, రైతాంగం, కార్మిక సమస్యలపై మల్లికార్జున ఖర్గే నిరంతరం పోరాటం చేస్తున్నారని తెలిపారు. అలాంటి జాతీయ నాయకుడిపై అస్సాం ముఖ్యమంత్రి అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు.ఖర్గేపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ తరపున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, మతిన్, అక్షయ్, శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

- సోషల్ సబ్జెక్టుపై పదవ తరగతి విద్యార్థులకు కలెక్టర్ విద్యా బోధన.
- ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పర్యటన.
- పాఠ్యాంశాలపై విద్యార్థులచే చదివించి, సామర్థ్యాల పెంపు.



**రామాయంపేట, ఏప్రిల్ 8(సిరి న్యూస్)**

పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం మెదక్ జిల్లాలోని రామాయంపేట పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అందిస్తోన్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు, తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు.మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అవుతుందో.. లేదో.. పర్యవేక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన శాలను పరిశీలించి, ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.ప్రధానంగా గుడ్ల నాణ్యతను పరీక్షించి, వంట సామాగ్రి, సరుకులు, బియ్యం తదితరాలను తనిఖీ చేసి, గడువు తేదీలను సరిచూసుకోవాలన్నారు.పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రతి తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు బోధన చేశారు. ఈనెల 12వ తారీకు పదవ తరగతి సోషల్ ఎగ్జామ్ ఉన్న కారణంగా సోషల్ సబ్జెక్టు పై అక్షాంశాలు ,రేఖాంశాలు నిశితంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ విధానాల ద్వారా కలెక్టర్ బోధించారు.విద్యార్థులతో ప్రత్యక్షంగా కలెక్టర్ మాట్లాడి, పాఠ్యాంశాలను చదివించి, అందులోని ప్రశ్నలు అడు గుతూ, వారి బోధన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ మేరకు చదువుపై ఆసక్తి పెంచుకు నేలా ప్రోత్సహించారు.అంతేకాకుండా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి,. పరీక్షల సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని, కంటినిండా నిద్ర పోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.ఈ పరిశీలనలో రామాయంపేట తాసిల్దార్ రజని , కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# జోగిపేటలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల నిరవధిక సమ్మె

- విధుల బహిష్కరణతో ఇబ్బందులు
- రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి మద్దతు

**అందోలు ఏప్రిల్ 08,(సిరి న్యూస్):**



విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీ.వీ.ఏ.ఈ. జేఏసీ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారము జోగిపేట్ డివిజన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు నిరవదిక సమ్మె కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ఎస్పీడీసీఎల్ కంపెనీ చైర్మన్ వెంకట్ నాయక్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఏపీఎస్సిబి రూల్స్ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని. ఆర్టిజన్ కార్మికుల ను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని మీటర్ రీడింగ్ వర్కర్లను, పోల్ టు పోల్ వర్కర్లను ఎఫ్ ఓ సి వర్కర్లను కూడా విద్యుత్ సంస్థలను విలియం చేసుకోవాలని డిమాండ్ చేసారు. జిల్లా నాయకులు దుర్గ్యా నాయక్ , డివిజన్ చైర్మన్ రంజిత్, కార్మిక సంఘ నాయకులు నాగరాజు, జోగినాథ్,రాజేందర్, సాయిలు, పవన్, మల్లేశం, సుదాకర్, హరికష్ణ, సురేష్, వాసిం, ముఖ్తర్ పాషలు పాల్గొన్నారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి విద్యుత్ కార్మికుల సమ్మెకు బుధవారం మద్దతు పలికిన అనంతరం మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నారాయణఖేడ్, జోగిపేట సబ్డివిజన్లకు చెందిన 230 ఆర్టిజన్ కార్మికులతో పాటు ట్రాన్స్కో కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కంసాన్పల్లి గ్రామ సర్పంచ్ సునీత మహిపాల్

**అందోలు,ఏప్రిల్ 08, (సిరి న్యూస్):**

పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని మండల పరిధిలోని కంసాన్పల్లి గ్రామ సర్పంచ్ తెనుగు సునీత మహిపాల్ అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన ఆశం లక్ష్మి రవి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి వెంకటరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తెనుగు ప్రవీణ్, పార్టీ నాయకులు కృష్ణ, బాలయ్య, వీరేశం, బాలరాజ్, వార్డు మెంబర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసీ కార్యాలయంపై విజిలెన్స్ తనిఖీలు

**అమీన్పూర్: ఏప్రిల్ 08 సిరి న్యూస్**



అమీన్పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో జరుగుతున్న పలు అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. కార్యాలయంలోని పలు విభాగాలకు చెందిన కీలక రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. జీహెచ్ఎంసీ సర్కిల్కు సంబంధించిన అధికారులతో పాటు ఇతర సిబ్బందిని అధికారులు ప్రశ్నించి, కార్యాలయ పనితీరు, అనుమతుల ప్రక్రియపై వివరాలు సేకరించినట్టు సామచారం. అమీన్పూర్ పరిధిలో వెలుస్తున్న అక్రమ కట్టడాలకు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారు అనే కోణంలో ప్రధానంగా దర్యాప్తు సాగినట్టు తెలుస్తోంది. అమీన్పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ రాత్రికి రాత్రే బదిలీ కావడం.. కొత్త డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఇంకా ఛార్జ్ తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో విజిలెన్స్ తనిఖీలపై అమీన్పూర్లో ఉత్కంఠ నెలకొంది. ఈ తనిఖీల పూర్తి నివేదికను విజిలెన్స్ అధికారులు త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్

- శరవేగంగా పనులు.. ఇప్పటిదాకా 40 శాతం పూర్తి
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.161 కోట్లకుపైగా సాయం జమ
- వేడుకగా గృహ ప్రవేశాలు

**సిరిసిల్ల (సిరి న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు 40 శాతం పూర్తి చేసి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆత్మగౌరవ ప్రతీక సాకారం దిశగా ఇండ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోంది. ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా రూ.161 కోట్లకు పైగా ఆర్థిక సహాయం జమ చేసి.. రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నది. పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాల వేడుకలు సాగుతున్నాయి. సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతిఒక్కరి చిరకాల స్వప్నం. ఆ కల సాకారానికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడుతల్లో అందజేస్తుంది. 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది. 4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత రూ.లక్ష, గోడలు నిర్మిస్తే రూ.లక్ష, స్లాబ్ నిర్మించిన తర్వాత రూ.2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.



ప్రజా ప్రభుత్వం సహకారం..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో పెట్టి ఉచితంగా అందిస్తుంది. ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల పరిధిలో వార్డ్ ఆఫీసర్లు తమ తహశీల్దార్ దృష్టికి ముందస్తుగా తీసుకెళ్లాలి. ఇసుక ఉచితం.. రవాణా ఛార్జీలు నిర్మాణదారులు చెల్లించాల్సి ఉంటుంది. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా ద్వారా రూ.లక్ష రుణం అందించే ఏర్పాట్లు చేసింది.

**నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మోడల్ హౌస్ లు..**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 11 మండలాల్లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండా కాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. నాణ్యతలో కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.



**40 శాతం ఇండ్లు పూర్తి ..**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు 3,570 స్లాబ్ లెవెల్ లో ఉండగా, 1,419 పూర్తి కాగా, ఇంకా 2,151 ఇండ్లు తుది దశలో ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటి దాకా జిల్లాలో మొత్తం రూ.161 కోట్ల 22 లక్షల ఆర్థిక సహాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**శరవేగంగా పూర్తి చేసేలా ..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ శరవేగంగా పూర్తి చేసేలా పకడ్బందీగా సలహాలు, సూచనలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులతో ఇంటి నిర్మాణ సామాగ్రి, భవన నిర్మాణ కార్మికులు, వడ్రంగి, విద్యుత్ సేవలు అందించే వారితో సమావేశాలు ఏర్పాటు చేయించి, వారి ఫోన్ నెంబర్లు, వివరాలను లబ్ధిదారులకు అందుబాటులో పెడుతున్నారు. లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

**నెరవేరిన 20 ఏండ్ల కల..**

**కోడూరి రజిత, ఉప్పుగడ్డ, వేములవాడ పట్టణం**

నాకు సొంత ఇల్లు లేదు. 20 సంవత్సరాలుగా వేములవాడ పట్టణంలో నివాసం ఉంటున్న. సొంత ఇల్లు లేక చాలా ఇబ్బంది పడ్డ. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. నా ఇల్లు పూర్తి అయ్యింది. ఎంతో సంతోషంగా ఉంది. నా కల సాకారానికి సహకారం అందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ లకు కృతజ్ఞతలు.

**సద్వినియోగం చేసుకోవాలి**

**- వెంకట మాధవరావు, పీడీ హౌసింగ్**

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారు తమ సమీపంలోని హౌసింగ్ అధికారులను సంప్రదించాలి. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలోనే ఇల్లు పూర్తి చేసుకునేలా జిల్లాలో మా శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లు నిర్మించాం. నేరుగా సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చు.

# బెజ్జూర్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ఆసుపత్రి, పాఠశాలలు, తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

**బెజ్జూర్(సిరి న్యూస్):** జిల్లా కలెక్టర్ కె.హరిత బుధవారం బెజ్జూర్ మండలంలో పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు




స్నేహపూర్వకంగా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వేసవి కాలం నేపథ్యంలో వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీలకు ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిపోల్చి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి, తహశీల్దార్ రామ్మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి మిసరి వైకుంఠం, ఉప సర్పంచ్ రాచకొండ ఆదర్శ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జోగు రామన్నపై బాలురి గోవర్ధన్ రెడ్డి ఫైర్

**ఆదిలాబాద్ (సిరి న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శల నేపథ్యంలో మాజీ మంత్రి జోగు రామన్నపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బాలురి గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎప్పుడైనా పార్టీ మారాలనుకున్నప్పుడు ఆ పార్టీపై విమర్శలు చేయడం జోగు రామన్నకు అలవాటైపోయిందని అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. గతంలో టిడిపి నుంచి టీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేసి, తర్వాత అదే పార్టీలో చేరిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సీఎం రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే జోగు రామన్న ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఆయన చేసిన ఆరోపణల్లో



ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. 2013లో అప్పటి కలెక్టర్ అహ్మద్ బాబు ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం సుమారు 1500 ఎకరాల స్థలాన్ని గుర్తించినప్పటికీ, అప్పట్లో మంత్రిగా ఉన్న జోగు రామన్న, ఎంపీ నగేష్‌లు సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. 2018లో కొరట–చనాక ప్రాజెక్టు వద్ద భూ నిర్వాసితులకు ఇండ్లు మంజూరు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ, మంత్రిగా ఉన్న జోగు రామన్న ఒక్క ఇంటినైనా నిర్మించారా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే భూ నిర్వాసితుల కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. 2014లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో రూ.1100 కోట్లతో మైనార్టీ పాఠశాలల నిర్మాణం ప్రారంభించగా, అందులో రూ.600 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్న విషయంపై జోగు రామన్న స్పందించాలని డిమాండ్ చేశారు. తన ఆరోపణలపై మాజీ మంత్రి జోగు రామన్న శ్వేతపత్రం విడుదల చేయాలని, సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుధాకర్ గౌడ్, కొండూరి రవి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు సమయం కేటాయించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల (సిరి న్యూస్) :** వైద్య వృత్తి సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్‌లతో కలిసి వైద్య విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని, దీంతో మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించడం అవసరమని అన్నారు.



విద్యార్థుల క్షేత్ర పర్యటనలు, ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల సందర్శన, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాల కోసం ప్రభుత్వం మూడు బస్సులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ బస్సులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 నుంచి 15 సంవత్సరాల వరకు ఉపయోగంలో ఉంటాయని చెప్పారు. వైద్య విద్యార్థులు ప్రత్యేక విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం క్రీడా సామాగ్రిని అందించిందని, వైద్య విద్యతో పాటు క్రీడలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా చదువుపై మరింత ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**తాండూర్ (సిరి న్యూస్) :** మండలంలోని గోపాల్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నరసయ్య, ఉప సర్పంచ్ గాజుల సునీత ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పిల్లల ఎత్తు, బరువులను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.సౌందర్య, అంగన్వాడీ టీచర్లు కంబాల శోభ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



**సత్తుపల్లి (సిరి న్యూస్) :** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ ఇంచార్జ్ దైద రవీంద్ర అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18న తాండూర్‌లో హిందూ మహా సమ్మేళనం

**తాండూర్ (సిరి న్యూస్) :** మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18న తాండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో హిందూ మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహా సమ్మేళన కార్యక్రమానికి తాండూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆ రోజు వ్యక్తిగత పనులను కొంత కాలం పక్కన పెట్టి కార్యక్రమానికి పూర్తి సమయం కేటాయించాలని కోరారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు కిష్టంపేట హనుమాన్ మందిరం నుంచి భారీ శోభయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శోభయాత్ర, మహా సమ్మేళనంలో ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# పెద్దిన్ని సత్యం ఆశయాల సాధన కోసం పని చేస్తాం



**సత్తుపల్లి (సిరి న్యూస్) :** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండల పరిధిలోని లింగపాలెం గ్రామంలో బుధవారం అమరజీవి కామ్రేడ్ పెద్దిన్ని సత్యం 33వ వర్ధంతి సందర్భంగా సభ నిర్వహించారు. గ్రామ సీపీఎం శాఖ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ పెద్దిన్ని సత్యం ఆశయాల సాధన కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. నేటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీలకతీతంగా ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సభ గ్రామ సీపీఎం శాఖ కార్యదర్శి కొత్తా అప్పారావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం డివిజన్ నాయకులు రావుల రాజబాబు, సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, పెద్దిన్ని సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి వెంకటేశ్వరరావు, మల్లూరు చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ ఎర్రా రమేష్, ఎర్రా సత్యనారాయణ, సింగపోగు కేశవరావు, రాయల చెన్నారావు, సుజాత, బేతినీ చెన్నయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమొబైల్స్ ప్రారంభోత్సవంలో బోరంచు



**ఆదిలాబాద్ (సిరి న్యూస్) :** నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ ఆటోమొబైల్స్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్, మాజీ జెడ్పిటిసి రాజేశ్వర్ రెడ్డితో కలిసి షాప్‌ను ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా కొత్త వ్యాపారాలు ప్రారంభం కావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రావు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మాత శిశు సంరక్షణకు ప్రభుత్వం కృషి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల (సిరి న్యూస్) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయడం ద్వారా మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్ఎంఓ శ్రీధర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు చర్యలు చేపడుతోందన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. శుద్ధమైన తాగునీరు, పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీల వివరాలు నమోదు చేసి సమయానుసారంగా వైద్య పరీక్షలు, ఆహార నియమాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. జిల్లాలో ఆరోగ్య ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రులు, పల్లె దవాఖానాలు, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం మాతా శిశు ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో వరద నీటి సమస్య ఉన్నందున త్వరలో పూర్తి కానున్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, చెన్నూర్ మండల కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.129.25 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల (సిరి న్యూస్) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్ టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పటిష్ట చర్యలు అమలు చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని రహదారులపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, రహదారులపై అనధికార వాహన నిలుపుదలపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తక్కువ విజిబిలిటీ ఉన్న ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, అధిక వేగంతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేసేలా కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులపై కూడా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్రాక్టర్ల కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాలు గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రోడ్డు భద్రతపై ప్రతి మండలం, గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు తరలించడం, కల్వర్టుల వద్ద సూచికలు ఏర్పాటు చేయడం, పట్టణాలు, గ్రామాల్లో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే హాట్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఆసిఫాబాద్ (సిరి న్యూస్) :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆసుపత్రి పర్యవేక్షకులు డా. ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోద్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చి 50 పడకల నుండి 330 పడకలకు ఆసుపత్రి సామర్థ్యాన్ని పెంపొందించడం జరిగిందని, తదనగుణంగా సిబ్బంది నియామకం, వైద్య పరికరాలను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిపుణులను నియమించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తద్వారా ఆసుపత్రికి వచ్చే ప్రజల సంఖ్య పెరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రికి వచ్చే నిధులతో అత్యవసర మందులు, ఆక్సిజన్, ఇతర పరికరాల కొనుగోలుకు వినియోగించడం జరుగుతుందని, ఇతర అవసరాలకు కావలసిన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఖాళీ స్థలన్ని పార్కింగ్ కొరకు కేటాయించాలని, ఆసుపత్రి ఆవరణలోని ప్రాంతాన్ని ప్రైవేట్ మెడికల్ షాప్ జిరాక్స్, క్యాంటీన్, ఇతరత్రా ఏర్పాటు చేసుకునేందుకు నిబంధనల ప్రకారం అనుమతించాలని, తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మార్చురీ వ్యాన్, అంబులెన్స్ కొరకు, ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నందున అవసరమైన ఆపరేషన్ థియేటర్, పరికరాలు, సిబ్బంది నియామకం కొరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు కమిటీ సభ్యులు ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబాలకు మేమున్నాం

### భరోసా కల్పించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

**సిద్దిపేట (సిరి న్యూస్) :** కష్టాల్లో ఉన్న జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవడంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజే – ఐజేయు ) ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను, మాతృమూర్తులను కోల్పోయిన జర్నలిస్టులను బుధవారం ఆయన స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పారు.

**ప్రజా గాయకుడు జహంగీర్ కుటుంబానికి పరామర్శ**

తొలుత యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన ప్రజా గాయకుడు జహంగీర్ కుటుంబాన్ని విరాహత్ అలీ సందర్శించారు. ఆయన మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు.



**బాధిత జర్నలిస్టులకు నైతిక మద్దతు**

అనంతరం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామానికి చేరుకుని, ఇటీవల మాతృమూర్తిని కోల్పోయిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు రాజిరెడ్డిని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే రాయపోలు మండలం అనాజీపూర్ గ్రామంలో తల్లిని కోల్పోయిన సాక్షి విలేకరి నాగ వెంకట్ రెడ్డిని పరామర్శించి, వారి కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**జర్నలిస్టు సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం**

మూడు రోజుల క్రితం గుండెపోటుతో అకాల మరణం చెందిన సియాసత్ ఉర్దూ దినపత్రిక గజ్వేల్ సీనియర్ జర్నలిస్టు ఎక్బాల్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎక్బాల్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి తక్షణమే ఆర్థిక సహకారం అందేలా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా విరాహత్ అలీ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట పలువురు యూనియన్ నాయకులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు



**ఆసిఫాబాద్ టౌన్ (సిరి న్యూస్) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులను వేగవంతం చేసేందుకు ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి బుచ్చన్న లతో కలిసి జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో గల క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో పనిచేసే ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామీణ ప్రాంతాలలోని కూలీలకు ఉపాధి కల్పించాలని, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 100 మందికి పైగా కూలీలు పనిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీల హాజరును పక్కాగా నమోదు చేయాలని, ఎలాంటి అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూలీలను చైతన్య పరచి పనులు కల్పించడంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో లక్ష్యానికి అనుగుణంగా కూలీల సంఖ్య పెంపొందించి, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని తెలిపారు. కూలీల సంఖ్య పెంపొందించడం ద్వారా ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యా కోర్సుల శిక్షణ ప్రారంభం

**ఆసిఫాబాద్ టౌన్ (సిరి న్యూస్) :** నేటి పోటీ ప్రపంచంలో పుస్తక పరిజ్ఞానంతో పాటు కంప్యూటర్ నైపుణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ శ్రీ అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మార్చి 30 నుండి ఏప్రిల్ 10 వరకు వృత్తి విద్యా కోర్సులపై ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని 'మన కంప్యూటర్ రొమ్స్ ఇన్ఫోటెక్'లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించడం వల్ల విద్యార్థినులకు భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్వరి, అధ్యాపకులు స్రవంతి, మయూరి, భద్రకాళి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




# బుద్ధ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**కాగజ్నగర్ (సిరి న్యూస్) :** మే 1న జరిగే తథాగత్ గౌతమ బుద్ధుని 2570వ బుద్ధ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ శాఖల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, తాలూకా అధ్యక్షుడు కొండగుర్లే దేవాజీ, ప్రధాన కార్యదర్శి కొండగుర్లే గణపతి మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన గౌతమ బుద్ధుని జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. భారత దేశంలోని 15 రాష్ట్రాల్లో బుద్ధ జయంతి సందర్భంగా సాధారణ సెలవు ఇస్తున్నారని, తెలంగాణలో కూడా అదే విధంగా సెలవు ప్రకటించి బౌద్ధ పూర్ణిమను ఘనంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగజీవన్ రామ్, సేవాలాల్, కొమరం భీమ్ వంటి మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రపంచానికి శాంతి మార్గం చూపిన గౌతమ బుద్ధుని జయంతిని కూడా అధికారికంగా జరపాలని కోరారు. అలాగే కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బుద్ధ విహార్ లో పూజలు నిర్వహించే బౌద్ధాచార్యులకు గౌరవ వేతనం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం విక్రమ్, పిత్ర ప్రభాకర్, దుర్గం మాధవ్, ముర్మాడే నరసయ్య, దుర్గం వెంకటేష్, మానపల్లి ప్రభాకర్, కొండగుర్లే మారుతి, దుర్గం పుండలిక్, దుర్గం రామచందర్, ఎం.శివకుమార్, దుప్త సూర్యకుమార్, రౌతు దేవాజీ తదితరులు పాల్గొన్నారు.





సంపాదకీయం

# ప్రపంచాన్ని బలి చేసిన 'ట్రంప్' యుద్ధోన్మాదం

## అమెరికా ఆధిపత్య కాంక్షకు సామాన్యులే బలి!

అగ్రరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నాలు సామాన్య దేశాలకు శాపంగా మారుతున్నాయి. అమెరికా–ఇజ్రాయిల్‌ల యుద్ధ కాంక్ష వల్ల ఇరాన్ చితికిపోవడమే కాదు, ప్రపంచమంతా చమురు సెగతో విలవిల్లాడుతోంది. తాత్కాలిక కాల్పుల విరమణ కాదు, శాశ్వత శాంతే ప్రపంచానికి అవసరం. రాజకీయ ప్రయోజనాల కోసం దేశాల మధ్య చిచ్చు పెట్టడం అగ్రరాజ్యాలకు అలవాటుగా మారింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూల నిరంకుశ వైఖరి వల్ల మధ్యప్రాచ్యం అగ్నిగుండంగా మారింది. ఇరాన్‌పై బాంబు దాడులు చేయడం, ఆ దేశ అత్యున్నత నేత అయతుల్లా ఆలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అమెరికా సాధించింది శూన్యం. కానీ, ఈ యుద్ధ జ్వాలలు సృష్టించిన విధ్వంసం మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసింది.

### చమురు దౌత్యం.. డాలర్ ఆధిపత్యం

అమెరికా ఇరాన్‌పై దాడికి దిగడం వెనుక కేవలం రాజకీయ కారణాలే లేవు, ప్రధానంగా ముడి చమురుపై పెత్తనం మరియు 'డాలర్' సర్వాధిపత్యాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయం కనిపిస్తోంది. వెనెజువెలా తరవాత ఇరాన్‌ను లొంగదీసుకోవడం సులభమని భావించిన ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ ప్రతిస్పందనగా హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు సరఫరా అస్తవ్యస్తమైంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో 20 శాతం కేవలం ఈ చిన్న జలసంధి ద్వారానే జరుగుతుంది. దీనిని మూసివేయడం అంటే ప్రపంచ ఆర్థిక నరాలను తెంచడమే. రవాణాకు ఆటంకం ఏర్పడటంతో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. చమురు ధరల్లో స్వల్ప మార్పు వచ్చినా అది రవాణా, విద్యుత్, ఉత్పత్తి రంగాలపై పెను ప్రభావం చూపుతుంది. నేడు విమాన ప్రయాణాలు భారంగా మారడం నుంచి అంతర్జాతీయ విమానాలు రద్దు కావడం వరకు అన్నీ ఈ యుద్ధోన్మాద ఫలితాలే.

### ద్రవ్యోల్బణం: మూడవ ప్రపంచ దేశాల పాలిట శాపం

ఈ యుద్ధం వల్ల ధనిక దేశాల కంటే ఆసియా, ఆఫ్రికా వంటి మూడవ ప్రపంచ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయి. చమురు ధరలు పెరగడంతో డాలర్ విలువ పెరిగి, స్థానిక కరెన్సీల విలువ పడిపోతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడి కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. కేవలం చమురు మాత్రమే కాదు, దాని ఆధారిత ఉత్పత్తులైన ఎరువుల కొరత ఏర్పడి, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఇది ఆహారధాన్యాల కొరతకు దారి తీసి, శ్రామిక ప్రజానీకాన్ని ఆకలి కోరల్లోకి నెట్టే ప్రమాదాన్ని సూచిస్తోంది. డాలర్ విలువ ముడిచమురుతో ముడిపడి ఉంది. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వాన్నే ప్రమాదంలో పడేస్తున్నాయి. చమురు–డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం కోసం చమురు ఉత్పత్తి దేశాలపై రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది.

### బెడిసికొట్టిన వ్యూహం.. మేల్కొని ప్రపంచం

ఇరాన్‌లో తమకు అనుకూలమైన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న అమెరికా వ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. ఏకపక్ష దాడులు చేస్తే ఎదురుదాడులు తప్పవని ఇరాన్ చర్యలు నిరూపించాయి. ట్రంప్ ప్రకటించిన రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరమణ కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. నిజానికి యుద్ధాన్ని శాశ్వతంగా ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో అమెరికా భాగస్వామి కావాలి. సామ్రాజ్యవాద విస్తరణ, ముడిపదార్థాల కోసం ఆక్రమణ యత్నాలు ఇకపై సాగవని ట్రంప్ తెలుసుకోవాలి. వెనెజువెలాలో చేసిన ప్రయోగాలు ఇరాన్‌లో పారవని ఈ నెల రోజుల అనుభవం స్పష్టం చేసింది. ఒక అగ్రరాజ్యం తన అహంకారం కోసం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయడం అత్యంత అనైతికం మరియు చట్టవిరుద్ధం.

**ముడి పదార్థాలపై అదుపు సాధించడం కోసం యుద్ధాలు చేయడం వల్ల ప్రపంచం చెల్లిస్తున్న మూల్యం అపారం. పెట్టుబడిదారీ ప్రపంచం స్థిరంగా ఉండాలంటే శాంతి అవసరం. ఇప్పటికైనా అమెరికా తన యుద్ధోన్మాదాన్ని వీడాలి. కేవలం తన డాలర్ ప్రయోజనాల కోసం ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం అనే అగాధంలోకి నెట్టడం ఆపాలి. అప్పుడే ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఊపిరి పీల్చుకోగలవు.**

# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం

- 15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్
- హర్ముజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్



**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా–ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్–అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఇది యుద్ధానికి ముగింపు కాదు

- మొజ్తాబా ఖమేనీ సంచలనం
- 10న ఇస్లామాబాద్‌లో చర్చలు



**టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 8:** ప్రపంచం ఊపిరి పీల్చుకునే వార్త.. యుద్ధ మేఘాల మధ్య చిన్న ఆశారేఖ! గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాను వణికించిన అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల పాటు 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరింది. అయితే, ఈ శాంతి కేవలం 'తాత్కాలికమే' అని, యుద్ధం ముగిసిందని ఎవరూ భ్రమపడొద్దని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఇచ్చిన హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇది యుద్ధానికి ముగింపు కాదు.. కేవలం విరామం మాత్రమే. మా సైన్యం వేళ్లు ఇంకా గన్ ట్రిగ్గర్‌ల పైనే ఉన్నాయి. శత్రువు ఏమాత్రం దురాక్రమణకు పాల్పడినా పూర్తి బలంతో ధీటుగా స్పందిస్తాం" అని స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతానికి తక్షణమే దాడులు నిలిపివేయాలని తన సైనిక విభాగాలను ఆయన ఆదేశించారు.

### పాక్ మధ్యవర్తిత్వానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించారు. హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించడంతో, రెండు వారాల పాటు దాడులు చేయబోమని ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొల్పడానికి ఈ 14 రోజుల గడువు ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ పెట్టిన 10 ప్రధాన డిమాండ్లు (ఆంక్షల ఎత్తివేత, హర్మ్యూజ్‌పై నియంత్రణ వంటివి) కూడా సానుకూలంగా ఉన్నాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

### ఇస్లామాబాద్‌లో 'మహా' చర్చలు:

శాంతి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరు దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లో జరగనున్న ప్రత్యక్ష చర్చల్లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ చర్చల గురించి వైట్‌హౌస్ స్పందిస్తూ.. తుది నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటారని వెల్లడించింది. ప్రపంచ చమురు మార్కెట్ కుప్పకూలకుండా ఉండాలంటే ఈ చర్చలు సఫలం కావడం అత్యంత అవసరమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అమెరికాకు మద్దతిస్తాం.. కానీ

అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మద్దతిస్తామన్నారు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టంచేశారు. నెతన్యాహు కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయడం వంటి షరతులకు లోబడి.. రెండు వారాల కాల్పుల విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి మద్దతిస్తున్నట్లు పేర్కొంది. దీంతోపాటు ఇరాన్ అణు, క్షిపణి, ఉగ్రవాదం నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో.. యూఎస్, ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల లక్ష్యాలను సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని అగ్రరాజ్యం తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. అయితే, ఈ కాల్పుల విరమణ లెబనాన్ కు వర్తించదని తేల్చి చెప్పేసింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన ఇందుకు విభిన్నంగా ఉంది. అమెరికా– ఇరాన్ అంగీకరించిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### లెబనాన్‌పై దాడులు..

లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ.. ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగించడం గమనార్హం.

# యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్

### భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌పై రెండు వారాల పాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. .

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

### దాదాపు 4 వేల వరకు పెరిగిన తులం ధర

**హైదరాబాద్, ఏప్రిల్ 8:** యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక పడడంతో పసిడి ప్రియులకు షాక్ ఇచ్చే విధంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,49,840 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,37,350 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,12,380 దగ్గర ట్రేడ్ అయింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం బుధవారం 24 క్యారెట్లపై 3,980 రూపాయలు.. 22 క్యారెట్లపై 3,650 రూపాయలు.. 18 క్యారెట్లపై 2,990 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,53,820 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,000 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,370 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఈ రోజు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ వెండిపై పది వేలు పెరిగి 2,65,000 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల వెండిపై వెయ్యి పెరిగి 26,500 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# సురక్షితంగా ఇరాన్‌ను వీడండి

### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్–అమెరికా (ఎసజీని–జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.